పదోన్నతుల్లేవు.. మెడికల్ బిల్లులు ఇవ్వట్లేదు

● జేఎన్‌టీయూ వీసీతో బోధనేతర సిబ్బంది గగ్గోలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పదోన్నతి పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మూడేళ్లుగా తమ ఆవేదనను పాత, కొత్త రిజిస్ట్రార్లు ఆలకించలేదని జేఎన్‌టీయూలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులు, అధికారులు ఆరోపించారు. యూనివర్సిటీ ఉద్యోగులతో బుధవారం సమావేశమై.. ఏవైనా సమస్యలుంటే తెలపాలని వైస్ చాన్స్‌లర్ కె.నర్సింహారెడ్డి కోరగా.. బోధనేతర సిబ్బంది తమ కష్టాలను ఏకరువు పెట్టారు. పలువురు ఉద్యోగులు, అధికారులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఉద్యోగులకు, పెన్షనర్లకు మెడికల్ బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. యూనివర్సిటీలో అవసరానికి మించి భవన నిర్మాణాల పేరిట కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల బిల్లులు వెంటనే చెల్లిస్తున్నారు గానీ, ఉద్యోగుల మెడికల్ బిల్లులను (సుమారు రూ. 10 లక్షలు) మాత్రం ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను అకారణంగా దూర ప్రాంతాలకు బదిలీ చేశారని, వారిని తిరిగి వెనక్కి తెప్పించాలని కొన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వీసీ దృష్టికి తెచ్చారు. ఉద్యోగులు లేవనెత్తిన సమస్యలపై వీసీ స్పందిస్తూ.. మెడికల్ బిల్లులను వారంలోగా క్లియర్ చేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగియగానే పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఎంతో కాలంగా దూరప్రాంతాల్లోని జేఎన్‌టీయూ కళాశాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కూడా హైదరాబాద్‌కు రప్పించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, పలువురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, డిప్యూటీ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్‌స్కేల్!

పాతికేళ్లుగా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను టైమ్‌స్కేల్ ఉద్యోగులుగా పరిగణించాలని పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వీసీ నర్సింహారెడ్డిని కోరారు. ఖాళీగా ఉన్న సీనియర్ లెవల్ పోస్టులను అంతకంటే కిందిస్థాయి సిబ్బందితో నింపాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతియేటా ఇంక్రిమెంట్ ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి పాలకమండలి ఆమోదంతో ప్రభుత్వానికి పంపాలని మరికొందరు ఉద్యోగులు కోరారు. వీసీ స్పందిస్తూ.. టైమ్‌స్కేల్ ఇచ్చే అంశం తన పరిధిలో లేదన్నారు. యూనివర్సిటీలో 1,200మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, అందరి ఇబ్బందులను తీర్చే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగుల సమస్యలను రాతపూర్వకంగా రిజిస్ట్రార్ సమర్పిస్తే, వాటిలో తమకు సాధ్యమయ్యే అంశాలను మాత్రం వెంటనే పరిష్కరిస్తామని వీసీ హామీ ఇచ్చారు. వీసీతో జరిగిన సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మహేశ్, గోపాల్, నర్సింగ్ రావు తదితరులు మాట్లాడారు. ఇదిలా ఉంటే.. మూడేళ్లుగా సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేసి, తీరా పదవీ విరమణ చేయబోయే సమయంలో.. సమస్యలుంటే చెప్పండి, పరిష్కరిస్తానని వీసీ చెబుతుండడం విడ్డూరంగా ఉందని కొందరు రెగ్యులర్ ఉద్యోగులు సమావేశం నుంచి బయటకు వచ్చాక విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు ఇవన్నీ కంటితుడుపు సమావేశాల్లాగే ఉన్నాయే గానీ, ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించే పరిస్థితి కనిపించ లేదని మరికొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోయారు.



ఇందిరానగర్‌లో పాదయాత్ర చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మోదీ పాలనతోనే పేదలకు న్యాయం

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోదీ పాలనతోనే పేదలకు న్యాయం జరుగుతుందని కేంద్రమంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్, జవహర్‌నగర్, ఫిలింనగర్‌లోని గౌతంనగర్‌లో ఆయన బుధవారం పాదయాత్ర చేశారు. వివిధ బస్తీల్లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. సంక్షేమం పేరిట బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ఇదే తప్పిదం చేస్తున్నదన్నారు. ఇలాంటి ప్రభుత్వాలవల్ల తెలంగాణ అభివృద్ధిలో వెనుక పడడమే కాకుండా ఆర్థిక సంక్షోభం ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. బీజేపీతోనే సురక్షిత పాలన సాధ్యమవుతుందని, దేశవ్యాప్తంగా ప్రజలు పార్టీ వైపే మొగ్గు చూపిస్తున్నారని తెలిపారు. 500 సంవత్సరాలు నిర్మించని ఆయోధ్య రామమందిరం కేవలం మోదీ వల్లనే జరిగిందని చెప్పారు. కేంద్రం చేపట్టిన కార్యక్రమాలతో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ప్రపంచ దేశాలను సైతం ఆకట్టుకుంటుందని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా బీజేపీకే ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు గడ్డం వెంకటస్వామి, ఎం.శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

ప్రార్థనలకు ఈద్గా వద్ద ఏర్పాట్లు





ఎస్‌పీఆర్ హిల్స్ మైదానంలో ఈద్గా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ టీమ్ ఇండియా కెప్టెన్ అజారుద్దీన్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా గురువారం ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు రహమత్‌నగర్ ఎస్‌పీఆర్ హిల్స్ మైదానంలో రూ. 9లక్షలతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను బుధవారం మేయర్ గద్వాల విజయలక్ష్మి పరిశీలించారు. మైదానంలో ఏర్పాట్లు ఎలా ఉన్నాయి. ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా రంజాన్ పండుగ జరుపుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, మాజీ టీమ్ ఇండియా కెప్టెన్ అజారుద్దీన్ మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్పొరేటర్లు బాబా ఫసీయుద్దీన్, సీఎన్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

పేద వర్గాలకు మెరుగైన వైద్యం అందించాలి

అమీర్‌పేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్సింగ్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నాణ్యతతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని టీఆర్‌పీఎస్ ఆర్‌ఎంపీ, పీఎంపీ ఫౌండర్ అధ్యక్షుడు ఎస్.వెంకట్ రెడ్డి అన్నారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులతో బుధవారం అమీర్‌పేటలోని బ్లూఫాక్స్ హోటల్‌లో ఈవింగ్స్ అబ్రాడ్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమాని ముఖ్య అతిథిగా డాక్టర్ వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడారు. కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 80శాతం మంది విద్యార్థులు తొలి ప్రయత్నంలోనే అర్హత సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ ఫణి భూషన్, డాక్టర్ ఎండీ ఖలీల్ పాల్గొని మాట్లాడారు.

40 సార్లు రక్తమిచ్చాడు



రక్తదానం చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు.. ప్రమాదాల్లో గాయపడి సకాలంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్నా.. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిసినా చాలు.. ఆ ఇన్‌స్పెక్టర్ వెంటనే స్పందిస్తారు. వారి వివరాలు తెలుసుకొని, సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి వారికి అవసరమైన రక్తాన్ని దానం చేసి, వారికి మనోస్థైర్యాన్ని ఇచ్చి వస్తుంటారు. ఆయన ఎవరో కాదు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు. బుధవారం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేద మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమని తెలియగానే.. ఇన్‌స్పెక్టర్ నాగమల్లు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. కరోనా లాక్‌డౌన్ నుంచి అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి, కొంతమందికైనా ఊపిరిపోయాలని నిర్ణయించుకుని ఇప్పటి వరకు 40సార్లు రక్తదానం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నాగమల్లు తెలిపారు. యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని, తలసీమియాతో బాధపడుతున్న వేలాదిమంది చిన్నారుల, రోడ్డు ప్రమాదాల్లో అత్యవసర చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

సనత్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎండీఎంఏతో పాటు గంజాయి ఉన్న ఐదుగురు యువకులను రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లా కొక్కిరేణికి చెందిన వెన్ను నాగరాజు బంజారాహిల్స్ సింగరికుంటలో ఉంటూ ఈవెంట్స్‌లో డెకరేషన్ పని చేస్తున్నాడు. ఇతడికి బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన కరీంనగర్‌కు చెందిన గణేష్, మామునూరి భరత్, సాయిదిలీప్, మంచలన గౌతంతో స్నేహం ఉంది. గణేష్ పుట్టిన రోజు సందర్భంగా ఈ స్నేహితులు గోవా వెళ్లి కండోలిన్ పబ్‌లో పనిచేస్తున్న నాగరాజ్ అనే వ్యక్తి నుంచి 4 గ్రాముల ఎండీఎంఏ కొనుగోలు చేశారు. గోవా నుంచి నగరానికి బస్సులో వచ్చారు. వీరి వ్యవహారం గురించి సమాచారమందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు సనత్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో సంచరిస్తున్న నాగరాజు, గణేష్, భరత్, దిలీప్, గౌతంలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 గ్రాముల ఎండీఎంఏ, 20 గ్రాముల గంజాయి, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

బలహీన వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో దానం నాగేందర్ మాట్లాడారు. తాను రాజకీయ ప్రవేశం చేసింది కాంగ్రెస్ ద్వారానే అని గుర్తు చేశారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. రాజకీయ సమీకరణల నేపథ్యంలో పార్టీ మారినప్పటికీ కాంగ్రెస్ విధానాలు తాను ఇంకా వీడలేదన్నారు. సొంత పార్టీకి వచ్చినందుకు ఆనందంగా ఉందని ఇక మీదట ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని వర్గాల ప్రజల కోసం పనిచేయనున్నట్టు చెప్పారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే ఆరు పథకాలను అమలు చేయడం అభినందనీయమన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మైనారిటీలు సైతం కాంగ్రెస్‌తోనే ఉన్నారన్నారు. వారి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేయనుందని ప్రకటించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగరావు, ఆకులరాజు. కాటూరి రమేష్, వంశీ, సింహం, ఘనీ, యాదగిరి, భరత్, పద్మ, దనమ్మ, దీపా తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు సీటు కేటాయించకపోవడం బాధాకరం



మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

అమీర్‌పేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాదిగలను చిన్నచూపు చూస్తున్నారని, మేమందరం కలిసి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నామని, తమ జాతి మొత్తాన్ని పక్కన పెట్టి అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. మాదిగలను ఎన్నికలకు దూరం పెట్టాలని చూస్తున్నారని, ఇది న్యాయం కాదని ఆయన అన్నారు. ఇదే ధోరణి కొనసాగితే పార్టీకి నష్టం వాటిల్లుతుందన్నారు. మాదిగలకు సీట్లు ఇవ్వకపోవడం చారిత్రక తప్పిదమని ఈ తప్పును సరిచేసేందుకు పునరాలోచించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ తనకు దొరకడం లేదని తనకిలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురు కాలేదన్నారు. మాదిగ కులానికి పార్లమెంట్‌లో కూర్చునే అవకాశం కల్పించాలని కోరారు. తాను రాజకీయల కోసం మాట్లాడడం లేదని, పార్టీ మారే ఆలోచన కూడా లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అన్నగా పక్కనే ఉండి పని చేయాలనుకునే వ్యక్తినని వెల్లడించారు.

మితభోజన కార్యక్రమం ప్రారంభం



మితభోజన కార్యక్రమాన్ని ప్రారభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వయసును సైతం లెక్కచేయకుండా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్ సేవలు అనేక మందికి స్ఫూర్తినిస్తాయని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీకేగూడ పార్క్ వద్ద బుధవారం శ్రీనివాస సమాజ సేవా చారిటబుట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న మితభోజన కార్యక్రమాన్ని, చలివేంద్రాన్ని ప్రారంభించి పలువురికి వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 13సంవత్సరాలుగా వేసవిలో రెండు నెలల పాటు దాతల సహకారంతో పేదల ఆకలితీర్చుతూ... విద్యార్థులకు పుస్తకాలు పంపిణీచేస్తున్న సీనియర్ సిటిజన్స్‌ను అభినందించారు. సీనియర్ సిటిజన్స్ చేస్తున్న సేవలకు తాను సహకారం అందించానని, ఇకముందు కూడా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, కొలను బాల్ రెడ్డి, పార్థ సారధి, మాణిక్‌రావు, కృష్ణారెడ్డి, సహదేవ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మోహినీ భస్మాసుర నాటకం



నాటక ప్రదర్శనలో కళాకారులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉగాది పద్యనాటకోత్సవాల్లో భాగంగా పొత్తూరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటికలు ఆకట్టుకుంటున్నాయి. ఫిలించాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో బుధవారం మోహినీ భస్మాసుర పౌరాణిక పద్య నాటకాన్ని ఉషోదయ నాట్య కళామండలి రంగస్థల నటులు ప్రదర్శించారు. దాదాపు ఈ నాటకం రెండున్నర గంటల పాటు సాగింది. గయోపాఖ్యాన యుద్ధసీనులో శ్రీకృష్ణుడిగా బంగారు కంకణ గ్రహీత ఎం.రామలింగేశ్వరరావు, అర్జునుడిగా ఉప్పాల రాజేశ్వర్‌రావు భస్మాసురిడిగా మొగిలి పువ్వు వెంకట సుబ్బయ్య, నారదుడిగా అసోది అక్కిరెడ్డి, శంకరుడిగా కేసన నాగేశ్వర్‌రావు, విష్ణుమూర్తిగా కొప్పరపు శ్రీనివాసరావు, చిక్కాసురిడిగా ఆరాధ్యుల శ్రీనివాసరావు, డక్కాసురిడిగా మర్రివాడ సుబ్బారావు, లక్ష్మిగా సురభిజ్యోతి, మోహినీగా తిరుమలాబి భృంగిశ్వరుడిగా బొక్కసం సత్యనారాయణ అందించారు. ఈ నాటికకు హార్మోని యం సీహెచ్.శ్రీనివాసరావు, డోలక్ బాపిరెడ్డి, ఆహార్యం వెంకటస్వామి సహకారం అందించారు. వీనుల విందుగా సాగిన ఈ నాటకాన్ని సినీ ప్రేక్షకులు, కళాభిమానులు వీక్షించి పరవశించిపోయారు.

సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా అయ్యే వరకు ఉద్యమాలు



అమ్మవారిని దర్శించుకున్న పవన్ కుమార్ గౌడ్

అమీర్‌పేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లాగా ఏర్పాటయ్యే వరకు వివిధ కార్యక్రమాల ద్వారా తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ లష్కర్ సాధన సమితి ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం ఉజ్జాయిని అమ్మవారి ఆలయం నుంచి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మను గర్భగుడిలో దర్శించుకున్నారు. అనంతరం పవన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. జిల్లాలను ఏర్పాటు చేస్తే మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ అమ్మవార్లకు 1116 టెంకాయలు సమర్పించి మొక్కు తీర్చుకుంటామన్నారు. వచ్చేవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారితో పాటు సాధం బాల్‌రాజ్ యాదవ్, శైలేందర్, జగదీష్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, అశోక్ సుధాకర్ రెడ్డి, ముక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

15న 'స్వాలోయింగ్ ది నేషన్' ఆవిష్కరణ



మాట్లాడుతున్న బాబీ ఇందారియా

పంజాగుట్ట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభ ఖైతాన్ ఫౌండేషన్, కితాబ్‌ల ఆధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్, మహిళా విభాగం పూర్వ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ లక్ష్మీ మురుడేశ్వర్ పూరి రచించిన స్వాలోయింగ్ ది నేషన్ పుస్తకావిష్కరణ సభ ఈ నెల 15న బంజారాహిల్స్ రోడ్ నంబర్-1లోని తాజ్‌కృష్ణ హోటల్ బాల్‌రూమ్‌లో జరగనుంది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరైన బాబీ ఇందారియా వివరాలు వెల్లడించారు. పుస్తకావిష్కరణ సభలో అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగితారెడ్డి, ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్‌జుంగ్ పాల్గొంటారని తెలిపారు. సాహితీ ప్రియులు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని ఆమె కోరారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం

బంజారాహిల్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు వీడినా.. కార్యకర్తల బలం బీఆర్‌ఎస్‌కు పుష్కలంగా ఉందని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఫిలింనగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలు, నాయకుల బలం ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు నజరానాలకు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం ఇప్పటి నుంచే కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. డివిజన్‌లో ప్రతి వారం బస్తీల వారిగా కార్యకర్తలతో సమావేశం కానున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పెరిక కిరణ్, శంకర్, జ్యోతి, దీపక్, రమణమ్మ, విష్ణు నాయక్, విక్కి, స్రవంతి, వినయ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గురుద్వారా నిర్వాహకులు

12 నుంచి గురుద్వారాలో వైశాఖీ ఉత్సవాలు

అమీర్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఖల్సాపంత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేటలోని ప్రం బంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి మూడు రోజుల పాటు వైశాఖీ ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు గురుద్వారా సాహెబ్ ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం గురుద్వారా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శన్‌సింగ్, సర్దార్ సురేందర్‌సింగ్ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో వైశాఖీ ఉత్సవాలను అమీర్‌పేట గురుద్వారా వేదికగా నిర్వహిస్తామని, మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సుమారు రూ. 50వేల మంది సిక్కులు, ఇతర మతాల భక్తులు హాజరవుతారని తెలిపారు. భారీ ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో గురుద్వారా ఉపాధ్యక్షులు సర్దార్ ఆహోర్‌సింగ్, సర్దార్ జస్వంత్ సింగ్, చైర్మన్ అజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు

బంజారాహిల్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని సయ్యద్‌నగర్‌లో పూండ్ల వెంకు రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ అధినేత పూండ్ల వెంకురెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. 3 వేలమందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్, రఫీద్‌ఖాన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్‌రహదారి ఎవరి అధీనంలో ఉందో తెలియజేయాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి(హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు) ఎవరి అధీనంలో ఉందో తెలియజేయాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్లుగా రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రాష్ట్ర రహదారి భద్రతాధికారులకు బాధిత కుటుంబాలు మొరపెట్టుకున్నాయని అన్నారు. రాజీవ్ రహదారిపై నిబంధలన ప్రకారం రక్షణ సౌకర్యాలు (ట్రామా కేర్ సెంటర్లు) ఏర్పాటు చేసే వరకు టోల్ చార్జీల వసూలును నిలిపివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

● 13 మంది నిందితుల అరెస్ట్

● వీరిలో నలుగురు మైనర్స్

నిజాంపేట్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న ప్రగతినగర్‌లో హత్య చేసిన నిందితులను బాచుపల్లి పోలీసులు 13మందిలో నలుగురు మైనర్లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి ఆరు సెల్ ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... బోరబండ మోతీనగర్‌కు చెందిన నిందితులు ముందుగానే పథకం ప్రకారం ఓ హోటల్లో తేజాస్ హత్య గురించి చర్చించుకున్నారు. అనంతరం శివప్ప తేజాస్ ఇంటికి వెళ్లి మద్యం తాగాడు. వారి ప్రణాళిక ప్రకారం అపార్టుమెంట్ పై అంతస్తు నుంచి తేజాస్‌ను కిందికి తీసుకవచ్చి, తన స్కూటీపై సమీర్ వద్దకు తీసుకవెళ్లాడు. సమీర్ తన వద్ద ఉన్న కత్తితో తేజాస్‌ను పొడిచి చంపాడు. హత్యకు సహకరించిన రోహిత్, షమీర్, సిద్దేశ్వర్, శివప్ప, గణేష్, సునీల్, రాహుల్, తిరుమల్, మహేష్‌లను పోలీసలు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా నలుగురు మైనర్స్‌ను జ్వూ వైనల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేధించిన సిబ్బందిని డీసీపీ అభినందించారు.

లారీని ఢీకొట్టిన బైక్

● యువకుడి మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సంగారెడ్డి జిల్లా కర్ది మండలం, సిద్దంగిరి గ్రామానికి చెందిన రత్నప్ప కుమారుడు ఎం.సంపత్‌కుమార్ (35) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి సూరారంకాలనీ ప్రాంతలోని సాయిబాబానగర్ మొండి నర్సింహాబస్తీలో ఉంటూ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో సంపత్‌కుమార్ జైరాజ్‌ఇస్పాత్ ఎదరుగా ఉన్న రోడ్డు నుంచి ఇంటికి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో సంపత్‌కుమార్ కిందపడ్డాడు. లారీ ముందు చక్రాలు తలపై నుంచి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌లోకి కనకరాజు

ఓల్డుబోయినపల్లి: గ్రేటర్ హైదరాబాద్ గొల్ల కురుమ నవ నిర్మాణ సంఘం అధ్యక్షుడు కనకరాజు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓల్డుబోయినపల్లికి చెందిన సీనియర్ నాయకుడు దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో కనకరాజుతో పాటు అంజయ్యనగర్‌కు చెందిన గోపాల్ ముదిరాజ్, మల్లేష్, తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరారు.



ఉచిత చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

చలివేంద్రం ప్రారంభం

తార్నాక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో తార్నాకలోని బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్ర శిబిరాన్ని బుధవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి ప్రారంభించారు.

కంటోన్మెంట్ సీటును కేటాయించాలి

బీజేపీ అధిష్టానానికి సీనియర్ నేత రాములు వినతి



రాములు

సికింద్రాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించిన బీజేపీ అధిష్టానం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సీటును మాదిగ సామాజికవర్గానికి కేటాయించాలని, గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసిన తనకు అవకాశం ఇస్తే గెలిచి చూపిస్తానని జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు విజ్ఞప్తి చేశారు. బుధవారం సికింద్రాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో పార్టీ ఆదేశాల మేరకు తాను కంటోన్మెంట్ నుంచి పోటీ చేశానని, తనకు అన్నివర్గాల ప్రజల మద్దతు ఉందని చెప్పారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో మాలవర్గానికి ప్రాధాన్యతనివ్వడంతో మాలలంతా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారని, ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించిన బీజేపీ అధిష్టానం కంటోన్మెంట్ సీటును మాదిగ వర్గానికి కేటాయిస్తే యావత్ మాదిగ వర్గం బీజేపీకి అండగా నిలవడం ఖాయమని అన్నారు. అటు మోదీ చరిష్మా, ఇటు మాదిగ వర్గీయుల మద్దతుతో కంటోన్మెంట్‌లో కమలం పార్టీ తప్పక విజయం సాధిస్తుందని రాములు ధీమా వ్యక్తం చేశారు.

మహిళ మృతదేహం లభ్యం



మహిళ మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ప్లాట్‌ఫాం నెంబరు 8లో గుర్తుతెలియని 50ఏళ్ల మహిళ చనిపోయి ఉండగా తోటి ప్రయాణికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో..



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

అడ్డగుట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ చిలకలగూడ చౌరస్తాలో వృద్ధుడు మృతి చెందిన సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ చిలకలగూడ ఓలిఫెంట బ్రిడ్జి సమీపంలో రైల్వే స్టేషన్ బోయగూడ వైపు మంగళవారం ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని 65ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండగా, స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలి

కుషాయిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం చర్లపల్లిలోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో జరిగిన ఉప్పల్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈనెల 14న నిర్వహించ తలపెట్టిన ఎన్నికల ప్రచార ర్యాలీని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి, ఎన్నికల కో-ఆర్డినేటర్ సిద్దేశ్వర్, కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్లు వివిధ డివిజన్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

దుండిగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయి తీసుక వచ్చి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను సైబరాబాద్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి వీరి నుంచి రూ.33 వేల 750 విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన రంజన్‌దాస్ (26), కేశవ్‌కాడ్(28)కె. గంగ (31)లు గండిమైసమ్మ సమీపంలోని శ్రీ చైతన్య క్యాంపస్ సమీపంలో గుడిసెలు వేసుకొని సెంట్రింగ్ పని చేస్తుంటారు.సెంట్రింగ్ పనిలో సంపాదన తక్కువ రావడంతో ఎక్కువ సంపాదించాలనే ఆశతో ఒడిస్సాకు చెందిన రావణ్ (16) గంజాయి సరఫరా చేయాలని ముగ్గురు కోరారు. రావణ్ మల్కాన్‌గిరి ఒడిస్సా నుంచి హైదరాబాద్‌లోని గండిమైసమ్మకు తీసుకొని వచ్చి రంజన్‌దాస్, కేశవ్‌కాడ్, గంగలకు గంజాయి కిలో రూ.7 వేల చొప్పున 1.35 కేజీల గంజాయిని ఇచ్చాడు. గంజాయి విక్రయిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు దుండిగల్ సమీపంలోని చింతల్ యాదగిరి ఖాళీ స్థలంలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించగా రావణ్ సరఫరా చేశాడని నిందితులు ఒప్పుకున్నారు. రావణ్ పరారీలో ఉండగా ముగ్గురిని అరెస్ట్ చేసి, ఒక సెల్ ఫోన్ రూ. 33 వేల 750 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

'ఘర్ వాపసీ'కి హస్తం పార్టీ శ్రీకారం

● సొంత గూటికి చేరిన జంపన ప్రతాప్



జంపన ప్రతాప్‌కు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మైనంపల్లి, కూన శ్రీశైలంగౌడ్, వెన్నెల, శ్రీగణేష్

సికింద్రాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఉప ఎన్నిక జరుగుతున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఘర్ వాపసీ కార్యక్రమానికి హస్తం పార్టీ శ్రీకారం చుట్టింది. ఎన్నో ఏళ్ల కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించి, ఆయా కారణాల వలన పార్టీని వీడిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకునేందుకు 'ఘర్ వాపసీ' కార్యక్రమంపై పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా దివంగత మంత్రి పి.జనార్దన్‌రెడ్డి ముఖ్య శిష్యునిగా పేరొంది. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజకీయాల్లో తనదైన ముద్ర కలిగి ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ బీజేపీకి గుడ్‌బై చెప్పి, సొంత గూటికి చేరుకున్నారు. పీసీసీ సారథి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మల్కాజగిరి లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు చొరవతో జంపన ప్రతాప్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నాయకులు వెన్నెల, ఎన్.శ్రీగణేష్, మర్రి అమరేందర్‌రెడ్డిల సమక్షంలో జంపన ప్రతాప్‌కు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జంపన ప్రతాప్ చేరికతో కంటోన్మెంట్, అసెంబ్లీ, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడినట్టయిందని రేవంత్‌రెడ్డి అన్నారు.

కంటోన్మెంట్ ఉప ఎన్నికలో, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలో హస్తం పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా జంపనకు, ఆయన అనుచరులకు సూచించారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్, ఆలయ చైర్మన్



నిప్పుల గుండంలో నడుస్తున్న ఒగ్గు కళాకారులు, శివసత్తులు, భక్తులు

పద్మారావునగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉగాది ఉత్సవాల్లో భాగంగా బోలక్‌పూర్‌లోని దుర్గా భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం రాత్రి గంగ తెప్ప, గొలుసు తెంపుట కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలతో పాటుగా మధ్యాహ్నం దుర్గాభ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు, ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలో గురువారం అశేష భక్తజన సందోహం నడుమ కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన నిప్పులగుండానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒగ్గు కళాకారులు, అర్చకులు, శివసత్తులు, భక్తులు నిప్పుల గుండంలో నడిచారు. అందంగా అలంకరించిన బోనాలను ఎత్తుకొన్న శివసత్తులు డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సమర్పించారు.

40సార్లు రక్తమిచ్చిన ఇన్‌స్పెక్టర్



రక్తదానం చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలు.. ప్రమాదాల్లో గాయపడి సకాలంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్నా.. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిసినా చాలు.. ఆ ఇన్‌స్పెక్టర్ వెంటనే స్పందిస్తారు. వారి వివరాలు తెలుసుకొని, సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి వారికి అవసరమైన రక్తాన్ని దానం చేసి, వారికి మనోస్థైర్యాన్ని ఇచ్చి వస్తుంటారు. ఆయన ఎవరో కాదు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు. బుధవారం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేద మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమని తెలియగానే.. ఇన్‌స్పెక్టర్ నాగమల్లు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. కరోనా లాక్‌డౌన్ నుంచి అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి, కొంతమందికైనా ఊపిరిపోయాలని నిర్ణయించుకుని ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నాగమల్లు తెలిపారు. యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని, తలసీమియాతో బాధపడుతున్న వేలాది మంది చిన్నారుల, రోడ్డు ప్రమాదాల్లో అత్యవసర చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాజీవ్ రహదారి ఎవరి అధీనంలో ఉందో తెలియజేయాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి (హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు) ఎవరి అధీనంలో ఉందో తెలియజేయాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సొంబరాజు చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్లుగా రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రాష్ట్ర రహదారి భద్రతాధికారులకు బాధిత కుటుంబాలు మొరపెట్టుకున్నాయని అన్నారు. రాజీవ్ రహదారిపై నిబంధలన ప్రకారం రక్షణ సౌకర్యాలు (ట్రామా కేర్ సెంటర్లు) ఏర్పాటు చేసే వరకు టోల్ చార్జీల వసూలును నిలిపివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



అమ్మవారిని దర్శించుకున్న పవన్ కుమార్ గౌడ్

సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా అయ్యే వరకు ఉద్యమాలు

అమీర్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లాగా ఏర్పాటయ్యే వరకు వివిధ కార్యక్రమాల ద్వారా తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ లష్కర్ సాధన సమితి ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం ఉజ్జాయిని అమ్మవారి ఆలయం నుంచి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మను గర్భగుడిలో దర్శించుకున్నారు. అనంతరం పవన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. జిల్లాలను ఏర్పాటు చేస్తే మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ అమ్మవార్లకు 1116 టెంకాయలు సమర్పించి మొక్కు తీర్చుకుంటామన్నారు. వచ్చేవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో పాటు సాధం బాల్‌రాజ్ యాదవ్, శైలేందర్, జగదీష్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, అశోక్ సుధాకర్ రెడ్డి, ముక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుటుంబపార్టీలను ఓడిద్దాం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



మెట్టుగూడలో ప్రచారం నిర్వహిస్తున్న కిషన్‌రెడ్డి

చిలకలగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ పార్టీలేనని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వాటిని ఓడిద్దామని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్టుగూడ డివిజన్‌లో బుధవారం శివాలయం, హనుమాన్ టెంపుల్, గవర్నమెంట్ హస్పిటల్. ఆలుగడ్డబావి, తదితర ప్రాంతాలలో పర్యటించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వై జంక్షన్ వద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ పార్టీలేనని, గజదొంగల పార్టీలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబం 10సంవత్సరాలలో రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని, కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ప్రకటనలకే పరిమితమయిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో 12లక్షల కోట్ల అవినీతి జరిగిందని, రైతు బంధు పథకం రాష్ట్రంలో సరిగా అమలు కావడంలేదని పేర్కొన్నారు. వంద రోజుల్లో హామీల అమలు ఎక్కడని ప్రశ్నించారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో ప్రగతి పథంలో పయనిస్తుందని, జాతీయ రహదారులతో పాటు రైల్వేలు అభివృద్ధి చేశారని ఎయిర్‌పోర్టు తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 727కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రెండుమూడు నెలల్లో మెరుగైన సౌకర్యాలతో చర్లపల్లి స్టేషన్ ప్రారంభానికి సిద్ధం అవుతుందని కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లలో మెరుగైన సౌకర్యాల కల్పనకి చర్యలు చేపడుతున్నట్లు, పుణ్యక్షేత్రం కోమరవెల్లి రైలు నడపడానికి శంకుస్థాపన జరిగిట్లు గుర్తుచేశారు.

దేశ వ్యాప్తంగా 12కోట్ల టాయిలెట్ల నిర్మాణం జరిగిందని, 33శాతం మహిళలకి రిజర్వేషన్ అమలు జరిగిందని సుస్థిరపాలన, శాంతిభద్రతల పరిరక్షణ బీజేపీతోనే సాధ్యమని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.పాణి నాయకులు బండ కార్తీకరెడ్డి, పి.రవిప్రసాద్‌గౌడ్, చంద్రారెడ్డి, వెంకటేష్‌గౌడ్, శారదా మల్లేష్, యం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



లాల్‌బజార్ ఆల్ సెయింట్స్ చర్చి దగ్గర రోడ్డు ప్రమాదాలకు నిలయమైన క్రాసింగ్

ఆల్‌సెయింట్స్ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి

తిరుమలగిరి ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని ఆల్ సెయింట్స్ చర్చి వద్ద గల చౌరస్తా ప్రమాదకరంగా మారింది. ఈ చౌరస్తా గుండా వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. సికింద్రాబాద్ నుంచి తిరుమలగిరి చౌరస్తా గుండా రామక్రిష్ణాపురం బ్రిడ్జి మీదుగా సైనిక్‌పురి, ఈసీఐఎల్, కుషాయిగూడ ప్రాంతాలకు వేలాది మంది ప్రయాణం చేస్తారు. గతంలో ఇక్కడ ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్ళేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ చౌరస్తా వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

అల్వాల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం డీసీలు, అసిస్టెంట్ సీటీప్లానర్స్. ఏఎంహెచ్‌వో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జోన్ పరిధిలో 100 శాతం కమర్షియల్ టైఅప్‌లు పూర్తయ్యాయని, నిబంధనలు పాటించకుండా, సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు చేపడితే ఊపేక్షించేది లేదన్నారు. ఆయా సర్కిళ్ల పరిధిలో 147 జీవీపీ(గార్బెజ్ వల్లనరబుల్ పాయింట్స్) ఉండగా, గత మూడు నెలల్లోనే 101 జీవీపీలను తొలగించామన్నారు. జీవీపీలను తొలగించడానికి 4 వేల మంది ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజలు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటో టిప్పర్స్‌లోనే వేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రంజాన్ సందర్భంగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సీటీ ప్లానర్ ఉమాదేవి, డీసీలు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం మహిళలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న నివేదిత, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తానని కంటోన్మెంట్ నియోజకవర్గం దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత సోదరి, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదిత తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఆరవ వార్డులో స్థానిక బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత పర్యటించి ముస్లిం మహిళలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వార్డు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి, సోదరిలాగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో చిన్నపిల్లల్ని ఉపయోగించకుండా చర్యలు తీసుకోండి : వేణుగోపాల్

అడ్డగుట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో చిన్నపిల్లల్ని ప్రచారంలో పాల్గొనకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ కన్వీనర్ వేణుగోపాల్ బుధవారం ఎన్నికల అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పిల్లలు పాల్గొనకుండా నిరోధించడం బస్తీలో రాజకీయ నాయకులు పంచుతున్న మద్యం, మాదక ద్రవ్యాలలో పిల్లల్ని భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. పిల్లల సంరక్షణను గుర్తుంచుకుని బాలల హక్కుల చట్టం కింద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా నాయకుల ప్రచారంలో భాగంగా రోడ్‌షోలు, పాదయాత్రలు, ఎండలో పాల్గొంటున్న పిల్లలు అనారోగ్యానికి గురవుతారని గుర్తుచేశారు. 18 ఏళ్లలోపు పిల్లలు ప్రచారంలో పాల్గొంటే చట్టరీత్యా నేరమని గుర్తుచేశారు. వివిధ పార్టీల అభ్యర్థులకు సంబంధించి పిల్లలు పోస్టర్లు అంటించడం, బ్యానర్లు పట్టుకోవడం, ర్యాలీలో జై కొట్టడం, పిల్లల ప్రమేయాన్ని నిషేధించాలని కోరారు. పిల్లల్ని ప్రచారంలో ఉపయోగించుకుంటున్న పార్టీల నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధానంగా డిమాండు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సీ.హెచ్.లక్ష్మీనారాయణ, సువర్ణ, లక్ష్మి, ప్రవీణ్, భాగ్య పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం ప్రతినిధులతో కార్పొరేటర్ ప్రభుదాస్

అన్నపూర్ణకాలనీ నూతన కార్యవర్గం

కాప్రా, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని అన్నపూర్ణ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆంజనేయ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మల్లేష్ గౌడ్, విజయ్‌కుమార్, యూసుఫ్, ప్రధాన కార్యదర్శిగా సంజయ్ నాయక్, సంయుక్త కార్యదర్శులుగా రాజమల్లు, ప్రేమ్‌సాగర్, స్వామిగౌడ్, కోశాధికారిగా చంద్రశేఖర్‌గౌడ్ ఎన్నికయ్యారు.



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జీ.రాజేందర్‌గౌడ్

వృద్ధురాలిని బెదిరించి దోపిడీకి పాల్పడిన దొంగ అరెస్ట్

● దొంగతనం జరిగిన 5 గంటల్లోనే ఛేదించిన పోలీసులు

● బంగారు ఆభరణాలు స్వాధీనం

అల్వాల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారాన్ని దొంగలించిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. వచ్చుబొల్లారం, అంజనాపురీకాలనీలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో సుంచు సుగుణమ్మ(65) ఒంటరిగా ఉన్నారు. అలేరు గ్రామం, తెల్కపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన దేశమోనీ సాయితేజ(20) అంజనాపురీ కాలనీలోనే ఒక ఇంట్లో స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటూ.. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు సాయితేజ 8వ తేదీన సోమవారం మధ్యాహ్నం సమయంలో సుగుణమ్మ ఇంటి దగ్గరికి వెళ్లి రెక్కి నిర్వహించాడు. ఆమె మెడలో బంగారు అభరణాలను చూసి దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ రోజు అక్కడ జనాలు ఉండటంతో కుదరక తిరిగి తన రూమ్‌కి వెళ్లిపోయాడు. మరసటి రోజు ఉగాది పండుగ నాడు మంగళవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో మళ్లీ సుగుణమ్మ ఇంటి దగ్గరకు వెళ్లీ రెక్కి నిర్వహించాడు. సమీపంలో జనాలు ఎవ్వరూ లేకపోవడంతో ఇదే అదనుగా భావించి ఇంటి గేటు తీసుకుని లోనికి వెళ్లి సుగుణమ్మను దాహంగా ఉందని మంచినీళ్లు అడిగాడు, అమె నీళ్లు లేవని డోర్ పెడుతుండగా డోర్‌ను నెట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. సుగుణమ్మ గొంతును నిందితుడు సాయితేజ గట్టిగా పట్టుకుని భయభ్రాంతులకు గురిచేశాడు. ఆమె మెడలో దారంతో ఉన్న బంగారు అనెలు, బంగారు పతకములు, చెవికి ఉన్న పోగులను తెంచుకుని అక్కడి నుంచి నడుచుకుంటు తన రూమ్‌కి పారిపోయాడు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి 5 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి దోపిడి చేసిన బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నామని డీఐ రాజేందర్‌గౌడ్ వెల్లడించారు. కేసు ఛేదించిన డీఐ.రాజేందర్‌గౌడ్‌తో పాటు క్రైమ్ సిబ్బందిని ఏసీపీ రాములు, అల్వాల్ స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ రాహుల్‌దేవ్ ప్రత్యేకంగా అభినందించారు.

ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

సనత్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎండీఎంఏతో పాటు గంజాయి ఉన్న ఐదుగురు యువకులను రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లా కొక్కిరేణికి చెందిన వెన్ను నాగరాజు బంజారాహిల్స్ సింగరికుంటలో ఉంటూ ఈవెంట్స్‌లో డెకరేషన్ పని చేస్తున్నాడు. ఇతడికి బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన కరీంనగర్‌కు చెందిన గణేష్, మాముసూరి భరత్, సాయిదిలీప్, మంచలన గౌతంతో స్నేహం ఉంది. గణేష్ పుట్టిన రోజు సందర్భంగా ఈ స్నేహితులు గోవా వెళ్లి కండోలిన్ పబ్‌లో పనిచేస్తున్న నాగరాజ్ అనే వ్యక్తి నుంచి 4 గ్రాముల ఎండీఎంఏ కొనుగోలు చేశారు. గోవా నుంచి నగరానికి బస్సులో వచ్చారు. వీరి వ్యవహారం గురించి సమాచారమందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు సనత్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో సంచరిస్తున్న నాగరాజు, గణేష్, భరత్, దిలీప్, గౌతంలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4 గ్రాముల ఎండీఎంఏ, 20 గ్రాముల గంజాయి, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.